సమస్యలతో సహవాసం

- కష్టాల్లో కించుమండ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు
- ప్రహరీ, ఉపాధ్యాయుల క్వార్టర్ లేక ఇబ్బందులు
- శిథిలావస్థకు చేరిన భవనాలు
- అధికారులు స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రుల వినతులు



అరకొర సౌకర్యాలతో మరుగుదొడ్లు


ప్రహరీ లేని కించుమండ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల

డుంబ్రిగుడ: మన్యంలో సర్కారు బడుల పరిస్థితి దయనీయంగా ఉంది. కూటమి ప్రభుత్వం సర్కారు పాఠశాలలపై కనీసం దృష్టి సారించడం లేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పైబడినా మండలంలోని ఒక్క ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పని గాని, మరమ్మతు పని గాని చేయలేదు. విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తూ చదువులు కొనసాగిస్తున్నారు.

నాడు ఘనం.. నేడు దుర్భరం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సర్కారు బడులకు మహర్దశ కలిగింది. దశాబ్దాల తరబడి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యాయి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులకు జీవం పోశారు. సర్కారు బడుల రూపురేఖలు మారాయి. ఇందుకోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించింది. దేశంలో మరెక్కడ జరగని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలల అభివృద్ధి జరిగింది. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపాందించుకున్నాయి. మన్యంలోని ప్రభుత్వ పాఠశాలలు ఎవరూ ఊహించని విధంగా మారాయి. ఏజెన్సీలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు నిధులు సమకూర్చారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి.

కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సర్కారు బడులను విస్మరించింది. సర్కారు బడుల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైబడినా అభివృద్ధి కుంటుబడింది. ఉపాధ్యాయుల కొరత, అరకొర సౌకర్యాలు.. తాగునీటి, వసతి తదితర సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాఠశాలల్లో నెలకొన్న సమస్యల కోసం పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఆశ్రమ పాఠశాలలదీ ఇదే దుస్థితి.

తరలిపోతున్న విద్యార్థులు

మండలంలోని కించుమండ ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలలో సుమారు 320 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ పాఠశాల జాతీయ రహదారికి అనుకొని ఉండడం ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం భయంతో విద్యార్థుల తల్లిదండ్రులు దిగులు చెందుతున్నారు. ఈ పాఠశాల ఏ–గ్రేడ్ పాఠశాల కావడంతో ఇక్కడ సుమారు 600 మందికి అవకాశం ఉన్నా ప్రస్తుతం ఇక్కడ నెలకొన్న సమస్యల వల్ల విద్యార్థులు వేర్వేరు పాఠశాలలకు తరలివెళ్తున్నారు. ఈ పాఠశాల ఆవరణ మధ్య నుంచే గ్రామస్తులు సమీపంలోని తాగునీటి కోసం వెళ్తుంటారు. అలాగే గ్రామంలో ఎవరైనా మృత్యువాత పడినా ఈ పాఠశాల మధ్య నుంచి శ్మశానానికి తరలిస్తుంటారు. పాఠశాల ఉపాధ్యాయుల కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరింది. దీంతో పాటు అక్కడి మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక ఉపాధ్యాయులు ఇక్కడ నివాసముండడం లేదు. సమీప ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

శిథిల భవనంతో ముప్పు

ఇటీవల కురిసిన భారీ వర్షాల్లో ఈదురుగాలులకు కించుమండ ఆశ్రమ పాఠశాల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. పాఠశాలలో వసతిపై నిర్వహణ సిబ్బంది పటించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుం 320 మంది విద్యార్థులకు 50 వరకు మరుగుదొడ్లు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు ద్వారా ఈ పాఠశాలకు రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు సౌకర్యం కలిగిందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఈ పాఠశాల పశువుల పాకల ఉండేదని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమకూర్చిన నాడు–నేడు నిధులతో పనులు జరిగి కొంత మెరుగునట్టు చెబుతున్నారు. ఇదే పాఠశాలలో పూర్వ వసతి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారిందంటున్నారు. ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని స్థానికుల భయపడుతున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని తొలగించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఈ పాఠశాలలో నెలకొన్న ప్రహరీ తదితర సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ కోసం నిధులు కేటాయింపు జరిగి పిల్లర్ స్థాయి వరకు పనులు చేపట్టారు. నిధులు సరిపడక పనులు నిలిపేశారు. ఈ విషయాన్ని ట్రైబల్ వెల్ఫేర్ అధికారులకు తెలియజేశాం. నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– శెట్టి సుందరరావు, ఎంఈవో–1, డుంబ్రిగుడ

సమస్యలు పరిష్కరించాలి

ఈ పాఠశాలలో విద్యాపరంగా ఎంతో మెరుగ్గా ఉంది. అయితే ప్రస్తుతం ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాల్సింది ఉంది. అధికారులు స్పందించి ఈ పాఠశాలలో ప్రహరీతో పాటు ఉపాధ్యాయుల క్వార్టర్స్‌ను మరమ్మతు చేపట్టాలి.

– హరిబారికి రామునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి, కించుమండ, డుంబ్రిగుడ మండలం


శిథిలదశకు చేరిన పాఠశాల పాత భవనం


పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా బోరు


గాలికి ఎగిరిపోయిన వసతి గృహం పైకప్పు


శిథిలావస్థకు చేరిన ఉపాధ్యాయుల క్వార్టర్స్

క్లుప్తంగా

ఉపాధి పనుల గుర్తింపు


గ్రామసభలో ప్రసంగిస్తున్న ఉపాధి ఏపీఓ ప్రకాశ్

గంగవరం : గ్రామ పంచాయతీలో 2026–27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న ఉపాధి హామీ పనులు గుర్తింపునకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కలుముల అక్కమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఉపాధి ఏపీవో ప్రకాష్ మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు ఉపాధి హామీ పనికి హాజరుకావాలని లేనిపక్షంలో పని దినాలు తగ్గడం వల్ల గ్రామానికి వచ్చే మెటీరియల్ కాంపొనెంట్ తగ్గిపోతుందన్నారు. ప్రతీ ఒక్కరు ఈ పథకాన్ని ఉపయోగించుకుని పనిదినాలు పెంచుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ గంగాదేవి, ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వర్లు (గిరి), మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలి


ఎంపీపీ బాకా ఈశ్వరి

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాకా ఈశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఆధార్ కార్డులు పొందలేని వారు, కార్డులో వివరాల్లో మార్పు చేర్పులు వంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్ నమోద చేయించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9490798642 నంబర్‌కు సంప్రదించాలని ఎంపీపీ కోరారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


వరదలకు దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎంపీపీ లక్ష్మి, నాయకులు

వి.ఆర్.పురం: గోదావరి వరదల కారణంగా పంట నష్టం వాటిల్లిన రైతులకు పరిహారం ఇచ్చి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎంపీపీ కారం లక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నష్టం జరిగిన గ్రామాలను సోమవారం సందర్శించారు. పంట నష్టం వాటిల్లిన ప్రతి రైతులు విత్తనాలు సరఫరా చేయాలన్నారు. సర్పంచ్ పులి సంతోష్ కుమార్, పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామ్మూర్తి, కారం సుందరయ్య కె.సత్యనారాయణ, కుంజా కన్నయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

రంపచోడవరం: మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్‌స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.వి.రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.28వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, ఐదు డీఏలు బకాయిలు, పీఆర్‌సీ ఇప్పటికి సంవత్సర కాలం ఆలస్యమైందని, తక్షణమే చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని విమర్శించారు. పని గంటలు పెంపుదల, లేబర్ కోడ్‌ల ఉపసంహరణ చేసి తీరాలని ఆయన డిమాండ్ చేశారు.

పాఠశాల భవనం ప్రారంభం


గసభ గ్రామంలో పాఠశాలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ గసభ గ్రామంలో పాఠశాల భవనాన్ని సర్పంచ్ సునీత, ఎంపీటీసీ వంతల జెమ్మ సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ 15 ఆర్థిక సంఘం నిధులతో భవనం నిర్మించినట్టు చెప్పారు. ఆయా నిధులను పాఠశాలలో తాగునీటితో పాటు గ్రామంలో వీధిదీపాలు, పారిశుధ్య పనులకు కేటాయించామన్నారు. మాజీ సర్పంచ్ సురేష్‌కుమార్, సత్యనారాయణ, సీతమ్మ, కృష్ణ, గోపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీటీసీ ఆనంద్‌కుమార్

అరకులోయటౌన్: అరకులోయలోని పీటీజీ ఏపీఆర్ రెసిడెన్షియల్ గురుకులం పాఠశాలను ఎంపీటీసీ సభ్యుడు దురియా ఆనంద్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అరకొరగా వంకాయకూర, నీళ్ల సాంబారు పెట్టారన్నారు. మెనూ ప్రకారంగా నాణ్యమైన ఆహారం ఇవ్వాల్సి ఉన్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థులకు సరైన భోజనం అందడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మెనూ అమలు అయ్యేలా చర్యలు తీసుకొని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

జీఎస్టీ ధరలకు అనుగుణంగానే విక్రయాలు


దుకాణాలను పరిశీలిస్తున్న వినియోగదారుల సంఘ నాయకులు

పెదబయలు: మండల కేంద్రంలోని వారపు సంతలో దుకాణాలను మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు కూడ కృష్ణబాబు, జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ కౌన్సిల్ సభ్యుడు పాంగి శివప్రసాద్ సోమవారం పరిశీలించారు. నూతన జీఎస్టీ విధానాన్ని వ్యాపారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అమల్లోకి వచ్చిన నూతన జీఎస్టీ ధరలకు అనుగుణంగా వ్యాపారులు విక్రయించాలన్నారు. ప్రతీ దుకాణం వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని కోరారు. జీసీసీ మేనేజర్ అప్పన్న, వినియోగదారుల సంఘం నాయకులు చిట్టిబాబు, లోయితాస్ అప్పారావు, వర్తక సంఘం అధ్యక్షుడు త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర


కొయ్యూరులో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో, ఎంఈవో, ఉపాధ్యాయులు

డుంబ్రిగుడ: జిల్లా వ్యాప్తంగా మండల స్థాయి ఉపాధ్యాయులకు టీఏఆర్ఎల్ (టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్)పై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు తొలివిడత మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ మండలాల విద్యాశాఖాధికారులు, ఇతర అధికారులు మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. గణితం, తెలుగు పాఠ్యాంశాల్లో విద్యార్థులకు సామర్థ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు బోధించాల్సిన పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో ఉపాధ్యాయులు అమలుచేయాలన్నారు. విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూసి, వారిని బాగా తీర్చిదిద్దాలన్నారు.

డుంబ్రిగుడలో జరిగిన కార్యక్రమంలో సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ స్వామినాయుడు, ఎంఈవో–1 శెట్టి సుందర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి, కోర్సు డైరెక్టర్ ప్రసాద్, ఎంఈవో బోడంనాయుడు, రిసోర్సు పర్సన్లు వెంకటరమణ, మణిస్వామి, సంజీవరావు, మహేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఏటీడబ్ల్యూవో క్రాంతి కుమార్, ఎంఈవో రాంబాబు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: ఇందుకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్‌రాజు, ఎంఈవోలు కె.త్రిమూర్తులు, బాలుదొర, హెచ్‌ఎంలు నాగన్నదొర, శేఖర్ బాబు,నూకరాజు, చంద్రకళ, డీఆర్పీలు రామకృష్ణదొర, నాగేశ్వరరావు, శ్రీనువాసుదొర, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో సూరయ్యరెడ్డి , శిక్షకులు ఉదయ్, కోటేశ్వరరావు, శేఖర్‌బాబు తెలిపారు.


చింతపల్లిలో శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు


డుంబ్రిగుడలో మాట్లాడుతున్న ఏపీసీ స్వామినాయుడు


రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాలలో సూచనలిస్తున్న అధికారులు


రంపచోడవరంలో పాల్గొన్న ఎంఈవోలు త్రిమూర్తులు, బాలుదొర, అధికారులు

ఈకేవైసీతో బినామీ మస్తర్లకు చెక్


సిరిగిందలపాడులో వేతనదారులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ విశ్వనాథ్

రంపచోడవరం: ఉపాధి హామీ పథకంలో బినామీ మస్తర్లు నిరోధించడానికి ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని తీసుకొచ్చిందని డ్వామా ఏపీడీ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని సిరిగిందలపాడులో ఉపాధి పనులను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రంపచోడవరం క్లస్టరులో ఉన్న నాలుగు మండలాల్లో ఉపాధి హామీ వేతనదారులను ఈకేవైసీతో అనుసంధానం చేస్తున్నామన్నారు. రంపచోడవరం క్లస్టరులో 15,800 మంది వేతనదారులున్నారని, ఇప్పటివరకు 7, 800 మందికి ఈకేవైసీ జరిగిందని, వందశాతం లక్ష్యం పూర్తి చేయాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు.ఏపీవో శ్రీనివాస్, జేఈ డ్విన్, టీఏలు విధుషిమణి, టీఏపీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత

హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ పనసబంద, కిన్నెర్లోవా కొండప్రాంతమైన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారింది. రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పనసబంద గ్రామస్తులు సోమవారం శ్రమదానంతో గోతులు పూడ్చే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు మంజురైనప్పటికీ కొంతవరకు నిర్మాణ పనులు జరిగిందని, ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయన్నారు. అప్పటి నుంచి రోడ్డు నిర్మాణ పనులపై అధికారులు దృష్టి సారించలేదన్నారు. వర్షాలు కురిసినపుడు రోడ్డు దారుణంగా మారుతుందన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో తామంతా శ్రమదానంతో గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్డు మరమ్మతు పనులు చేయాలని వారు కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

మునగపాక: సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి మూలపేటకు చెందిన మొల్లేటి పరమేష్ రూ.50 వేలు విలువ చేసే ఇటుకను సమకూర్చారు. మొల్లేటి రాజేశ్వరరావు కుమారుడు గోవిందరావు రూ.5 వేలు విరాళం అందజేశారు. చంద్రరావు, సభ్యులు బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి జగ్గారావు, వెలగా వెంకటప్పారావు, వెలగా ధర్మసూరి, వెలగా శ్రీనివాసరావు, వెలగా జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


ప్రతిభావంతులైన బాలికలతో ఉపాధ్యాయులు

పాడేరు రూరల్: స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం మండలస్థాయి అండర్–17 బాలికల వాలీబాల్ పోటీలను సోమవారం నిర్వహించారు. పోటీల్లో గుత్తులపుట్టు బాలికల పాఠశాల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. ఆయా క్రీడాకారులను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్(క్రీడా) జిల్లా కార్యదర్శి పాంగి సూరిబాబు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మండల స్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు పంపిస్తామని, అక్కడ ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. వ్యాయమ ఉపాధ్యాయులు ప్రసాద్, కృష్ణవేణి, భవాని, సూర్య కుమారి, డిగ్రీ కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల్లో సమస్యల వెల్లువ


మొక్కపుట్టు గ్రామ సభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి


మూలపేటలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ముంచంగిపుట్టు: పెదగూడ పంచాయతీ కేంద్రం, వనుగుమ్మ పంచాయతీ వల్లెబీరు, మొక్కపుట్టు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఆది విశ్వకర్మ యోగి అభియాన్ గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి మాట్లాడుతూ తక్షణమే నిధులు మంజూరై, సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచులు కిరసాని మిల్కి, మండి బాబారావు, ఎంపీటీసీ సభ్యుడు గణపతి, కార్యదర్శులు సింహాచలం, కిరణ్ కుమార్, భగత్‌రాం, నేతలు పాల్గొన్నారు.

కొయ్యూరు: మూలపేటలో ఆది విశ్వకర్మ యోగి అభియాన్ గ్రామసభ సోమవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, డౌనూరు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.అప్పారావు, మూలపేట సర్పంచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. పీసా కమిటీ సభ్యులు రాజుబాబు, సత్తిబాబు, దాసు తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: కంద్రుమ్ పంచాయతీ జాంకరగుడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచ్ కిముడు హరి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, గ్రామ రెవెన్యూ అధికారి ముత్తెం కోటేశ్వరరావు , ఉప సర్పంచ్ కిముడుప్రతిమ, వార్డు సభ్యులు ముద్దుల కృష్ణ , పీసా ఉపాధ్యక్షుడు సద్దు, నాయకులు రామచంద్రరావు, రుక్మాంగధర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


మండల సచివాలయ నూతన కార్యవర్గ సభ్యులు


యూనియన్ నాయకులతో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, తదితరులు

చింతపల్లి: మండల సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా వి.శోభన్‌బాబు, కార్యదర్శిగా కె.నవమోహన్, ఉపాధ్యక్షుడిగా ఎల్.మోహన్, సహాయ కార్యదర్శిగా ఎస్.లలిత, కోశాధికారిగా జి.మనోహర్, కో–కోశాధికారిగా కె.పవన్‌కుమార్‌తో పాటు సభ్యులు భానుప్రకాష్, రవీంద్రలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

అరకులోయటౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయ యూనిట్ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్ ఆదేశాల మేరకు గిరిజన సంఘం భవనంలో సోమవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా బాబూరావు, కార్యదర్శిగా టి.కార్తీక్, ఉపాధ్యక్షురాలిగా బి.గంగమ్మ, సంయుక్త కార్యదర్శిగా కె.గెన్ను, పి.రంజిత్, కె. సింహాద్రి, కోశాధికారిగా పండు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెంకటరమణ, అప్పారావు, జోగులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు పురస్కారాలు



కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న చింతపల్లి ఎంపీపీ అనూషదేవి తాజంగి సర్పంచ్ మహేశ్వరి , రంపచోడవరం సర్పంచ్ బొజ్జయ్య



అవార్డు అందుకుంటున్న రాజవొమ్మంగి పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి , ఎంఎస్‌డీఎస్ సంస్థ అధినేత ఉండవల్లి గాంధీబాబు


అవార్డు అందుకుంటున్న కార్యదర్శి మోహన్

చింతపల్లి/రంపచోడవరం/మోతుగూడెం/రాజవొమ్మంగి/వి.ఆర్.పురం: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ఉత్తమ సేవలందించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి అవార్డులు అందజేశారు. పాడేరులో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ చేతుల మీదుగా పురస్కారాలు పొందారు. ఇందులో భాగంగా చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూషదేవి, తాజంగి సర్పంచ్ వంతల మహేశ్వరి, కార్యదర్శి శ్రీధర్, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య ,క్లాత్ మిత్ర మనమ్మ, కార్యదర్శి మోహన్, రాజవొమ్మంగి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం ఆదిలక్ష్మి , వి.ఆర్.పురంలోని రేఖపల్లిలో ఎఎస్‌డీఎస్ సంస్థ అధినేత ఉండవల్లి గాంధీబాబు తదితరులు అవార్డులు అందుకున్నారు.